కథానిక ◆ ముద్దంశెట్టి హనుమంతరావు

రామ్మూర్తి వీలర్స్ బుక్‌స్టాల్లో హిందూ దినపత్రిక కొనుక్కుని వెనక్కి తిరిగేసరికి చిరకాల మిత్రుడు కామరాజు అనూహ్యంగా కనిపించాడు ఎదురుగా.

ఇద్దరి ముఖాల్లోనూ ఓ విధమైన సంభ్రమం గోచరించింది. వారి పెదాలపై సన్నని దరహాసం చిందింది.

"ఒరేయ్ కామూ, ఎన్నాళ్ళకి కనిపించావురా" అన్నాడు రామ్మూర్తి సంతోషంగా స్నేహితుని భుజం మీద చేయి వేస్తూ.

"ఒరేయ్ రామూ, నాకూ అదే అనుభూతి కలుగుతోందిరా. విశాఖ స్టేషన్లో దిగుతున్నప్పుడు మనసులో అనుకున్నాను, 'నువ్వు అగుపిస్తే ఎంత బాగుణ్ణు' అని. సరిగ్గా నా ఆలోచన నిజమయింది. నాకు ఎంతో ఆనందంగా ఉందిరా" అన్నాడు కామరాజు ఆప్యాయంగా స్నేహితుని చేయి పట్టుకుంటూ.

"సరే పదరా" అంటూ ఆటో కట్టించుకుని స్నేహితుడితో పాటు ఇల్లు చేరుకున్నాడు రామ్మూర్తి.

ఇంటికి చేరుకోగానే, కాలింగ్ బెల్ నొక్కాడు రామ్మూర్తి. అతని కోడలు నిశ్చల తలుపు తెరిచింది. మావఁగారితో పాటు వచ్చిన వ్యక్తిని చూసింది. అతను ఎవరో, ఎందుకొచ్చారో ఆమెకి తెలీదు.

"వచ్చేశారా మావఁయ్యగారూ, మీరు వెళ్ళిన తర్వాత పేపరు బోయ్ పేపరు తెచ్చిచ్చాడు" అంది నిశ్చల.

"అయితే, అనవసరంగా మరో పేపరు కొన్నా నమ్మా. డబ్బులు వేస్టయ్యాయి." బాధపడుతూ అన్నాడు రామ్మూర్తి.

"సరేలెండి మావఁయ్యా, జరిగిపోయిందానికి ఏం చేస్తాం? రండి లోపలికి" అందామె.

"అమ్మా నిశ్చలా, వీడు నా చిరకాల మిత్రుడు కామరాజు. శ్రీకాకుళంలో ఉంటున్నాడు. మేమిద్దరం ఒకేసారి ఉద్యోగ విరమణ చేశాం. నేను పేపరు తీసుకొని వస్తుంటే అనుకోకుండా వీడు కలిశాడు. చాలా రోజుల తరువాత కలుసుకున్నాం. ఎన్నో కబుర్లు చెప్పుకోవాలని మనింటికి భోజనానికి ఆహ్వానించానమ్మా. భోంచేసి, వాళ్ళ కజిన్ దగ్గరికి వెళ్ళిపోతాడు. అక్కణ్ణించి శ్రీకాకుళం. ఈ వేళప్పుడు అదనంగా ఒక మనిషికి భోజనం ఏర్పాటు చెయ్యడం నీకు ఇబ్బంది అవుతుందనుకో. కానీ, కానీ..." నసిగాడు రామ్మూర్తి.

# అస్వతంత్రులు

**చాలాకాలం తరువాత తారసపడిన ప్రాణ మిత్రుణ్ణి ఇంటికి పిలిచి భోజనం పెట్టే పాటి స్వతంత్రం సొంత ఇంట్లోనే లేకపోతే...? కన్న బిడ్డల దగ్గరే కట్టు బానిసలా బతకాల్సి వస్తున్న నేటి తల్లితండ్రుల వ్యథ ఈ కథ**

"నిజంగా మన ఈ కలయిక భగవద్విలాసమేరా కామూ. లేకపోతే ఈ రోజు ఇంట్లో పేపరు వెయ్యక పోవడమేవిఁటి, నేను పేపరు కోసం స్టేషనుకి రావడమేవిఁటి. హఠాత్తుగా నువ్వు అగుపించడ మేవిఁటి" అన్నాడు రామ్మూర్తి.

"నువ్వన్నది అక్షరాలా నిజంరా రామూ. ఇది దైవ సంకల్పమే. లేకుంటే శ్రీకాకుళం రోడ్డు వరకూ టికెట్టు తీసిన నేను, మా కజిన్‌ని చూడాలనిపించి విశాఖలో దిగిపోవడమేవిఁటి? నువ్వు ఈ విధంగా కలవడం ఏవిఁటి?" నవ్వుతూ అన్నాడు కామరాజు.

"నీ ఆరోగ్యం బావుందా?"

"బావుందిరా. మరి నీదో?" ప్రశ్నించాడు కామరాజు.

"చూస్తున్నావుగా. బాగానే ఉన్నాను. చాలా రోజుల తరువాత కలుసుకున్నాం. మా ఇంటికోసారి రాకూడదురా? మా ఇల్లు దగ్గరే." ఆప్యాయంగా ఆహ్వానించాడు రామ్మూర్తి.

మిత్రుడు అంత ఆప్యాయంగా, అభిమానంతో తనింటికి రమ్మని ఆహ్వానిస్తుంటే కాదని చెప్పడానికీ, ఏదో కారణం చెప్పి తప్పించుకోవడానికీ కామరాజు మనసు అంగీకరించలేదు. కాదంటే, ఇన్నేళ్ళ నుంచీ పరిచయం ఉన్న సన్నిహిత మిత్రుడు రామ్మూర్తి ఎంత బాధపడతాడోనన్న సందేహం వచ్చిందతనికి. అందుకే, "సరేరా రామ్మూర్తీ. పద. రానంటే నువ్వు బాధపడతావు" అంటూ తన సంసిద్ధతను తెలియ జేశాడు కామరాజు.

రామ్మూర్తి కృత్రిమమైన నవ్వు నవ్వేడు. నిజానికి ఏదో సభ్యత కోసం స్నేహితుణ్ణి ఇంటికి ఆహ్వానించాడు గానీ, మనఃస్ఫూర్తిగా ఆహ్వానించలేదు. తన ఇంట్లో తనకున్న స్థానం ఏవిఁటో అతనికి బాగా తెలుసు. అయితే, స్నేహితుడు రానని చెపుతాడనే అనుకున్నాడు. కానీ, అందుకు భిన్నంగా జరిగింది. అందుకే ఆ కృత్రిమ నవ్వు.

"నమస్కారమండీ." కామరాజుని ఉద్దేశించి గౌరవపూర్వకంగా అంది నిశ్చల.

"మా కోడలు." చెప్పాడు రామ్మూర్తి.


"నమస్కారమమ్మా" అన్నాడు కామరాజు.

"రండి. లోపలికొచ్చి కూర్చోండి" అంటూ నాలుగడుగులు ముందుకేసింది నిశ్చల.

"ఒరేయ్ కామూ, వచ్చి కూచోరా" అన్నాడు రామ్మూర్తి.

కామరాజు లోపలికొచ్చి సోఫాలో కూర్చున్నాడు.

**రామ్మూర్తి కృత్రిమమైన నవ్వు నవ్వేడు. సభ్యత కోసం మిత్రుణ్ణి ఇంటికి ఆహ్వానించాడు గానీ, మనఃస్ఫూర్తిగా కాదు. తన ఇంట్లో తనకున్న స్థానం ఏవిఁటో అతనికి తెలుసు.**



"మావఁయ్యగారూ మీరోసారి లోపలికి రండి" అంటూ లోపలికి దారి తీసింది నిశ్చల.


రామ్మూర్తికి గుండె గుభేలుమంది. అయినా, తమాయించుకున్నాడు.

"ఈ పేపరు చదువుతూ ఉండరా, ఇప్పుడే వస్తాను" అంటూ తన చేతిలోని హిందూ పేపర్ని స్నేహితునికిచ్చి లోపలికి వెళ్ళాడు రామ్మూర్తి.

కామరాజుకి ఆ వాతావరణం అంతగా మింగుడు పళ్ళేదు. ఇబ్బందికరంగా కూర్చున్నాడు. పేపరు కూడా చూడలేదు. అక్కణ్ణించి వెళ్ళిపోవాలని పించినా వెళ్ళిపోలేదు. అది సభ్యత కాదనుకున్నాడు. అతనికి లోపల్నించి మాటలు వినిపిస్తున్నాయి.

"చూడండి మావఁయ్యగారూ, ఈ వేళప్పుడు మీరు ఎవర్నో తీసుకొస్తే, మళ్ళీ నేను వంట చెయ్యాలి కదా! నాకు ఇబ్బంది కలుగుతుందని మీరే అంటున్నారు. అది తెలిసి కూడా ఎప్పుడూ లేనిది ఈ కొత్త

చిత్రాలు: నర్సిం



అలవాటు ఎలా వచ్చింది మీకు" అంది మెల్లగా.

రామ్మూర్తి ఖంగుతిన్నాడు. అతని ముఖం స్వేదంతో నిండిపోయింది. ముఖాన్ని పంచెతో ఒత్తుకున్నాడు.

"అమ్మా నిశ్చలా, ఇప్పటికి ఏదో పొరపాటు జరిగిపోయింది. ఇంకోసారి ఇటువంటి పొరపాటు చెయ్యనని హామీ ఇస్తున్నానమ్మా. ఇప్పుడు నువ్వు కాదంటే నా పరువుప్రతిష్ఠలు మంటగలుస్తాయి. ఈ ఒక్క పర్యాయం నా మర్యాద కాపాడు. ఇది నా అభ్యర్థన. నా స్నేహితుడు నన్ను తక్కువగా అంచనా వేసుకోకూడదమ్మా." మెల్లగా అన్నాడు రామ్మూర్తి. అతని కళ్ళు చెమర్చినయ్. పంచెతో కళ్ళొత్తుకున్నాడు.

నిశ్చల అంత చెడ్డదేం కాదు. ఆమెకీ ఓ మనసుంది. అందుకే మావయ్య పరిస్థితిని అవగాహన చేసుకుంది. అయితే, ఇటువంటి అలవాటుని మొక్కలోనే తుంచేయాలనుకుంది. అందుకే కొన్తంత కటువుగానే ఉండాలని నిశ్చయించుకుంది.

"ఊఁ, సరేలెండి మావయ్యగారూ. ఇప్పటికేదో జరిగింది. మీ పొరపాటుని మీరు గ్రహించారు. అందుకే మీ పరువుప్రతిష్ఠలకు భంగం రానివ్వనండీ. కానీ, ఇకపైన ఇటువంటివి పునరావృతం కాకూడదు." గంభీరంగా చెప్పింది నిశ్చల.

"అలాగేనమ్మా" అన్నాడు ఉత్సాహంగా రామ్మూర్తి.

"సరే, మీరు వెళ్ళి మీ స్నేహితునితో మాట్లాడుతూ ఉండండి. వంట అవగానే మిమ్మల్ని కేక వేస్తాను."

"థ్యాంక్సమ్మా" అంటూ హుషారుగా అక్కణ్ణించి హాల్లోకి వెళ్ళి స్నేహితుని దగ్గర కూర్చున్నాడు రామ్మూర్తి.

అయితే, కామరాజు మొహం వాడిపోయింది. అతని అంతరంగంలో అలజడి అయినా, తమాయించుకున్నాడు.

ఆ ఇరువురు స్నేహితులు కాస్సేపు స్నేహితుల గురించి, తమ పిల్లల గురించి ముచ్చటించుకున్నారు. తెలిసిన మేరకు ఎవరెవరు ఎక్కడున్నారో చెప్పుకున్నారు.

కాస్సేపు ఎంతో హాయిగా గడిపారు.

"ఏదో ఇలా స్థిరపడ్డామన్న తృప్తి ఉందిరా రామ్మూర్తీ. ఈ విధంగా ఉన్నవాళ్ళూ చాలా అరుదుగానే ఉన్నారు" అన్నాడు కామరాజు.

"అది నిజమేరా రాజూ. ఆమధ్య ముకుందరావు కనిపించాడు. ఈ ఊళ్ళోనే ఉంటున్నాట్ట. అద్దె కొంపలో ఉంటున్నాట్ట. 'నిజాయితీ' అంటూ జీవితాన్ని గడిపాడు. ఇప్పుడు తెలిసివస్తోంది." నవ్వుగా నవ్వుతూ అన్నాడు రామ్మూర్తి. ఆ నవ్వులో కాస్త హేళన ధ్వనిస్తోంది.

"అలా మనం ఎందుకు అనుకోవాలి లేరా. ఎవరికున్న విలువ వారికుంది. వాళ్ళ అబ్బాయిలు ఏం చేస్తున్నారట?"

"వాళ్ళిద్దరూ పెద్ద ఉద్యోగాల్లో లేకపోయినా, హాయిగానే జీవితం సాగిపోతోందన్నాడు."

"అయ్యుండొచ్చురా రామ్మూర్తీ. అతనిలో మొదట్నుంచీ 'తృప్తి' అనే సుగుణం ఉందని మనకి తెలును. అదే అతణ్ణి హాయిగా ఉంచుతోందేమో" అన్నాడు కామరాజు.

సరిగ్గా అప్పుడే నిశ్చల వచ్చింది.

"మావయ్యగారూ, మీరిద్దరూ లేచి కాళ్ళు కడుక్కోండి. వడ్డించేస్తాను" అంది.

"అలాగేనమ్మా." తృప్తిగా అంటూ, బైట తీగ మీదున్న తువ్వాలు తీసుకొచ్చాడు రామ్మూర్తి.

"పదరా కామూ, బాత్రూమ్‌కి వెళ్దాం" అన్నాడు.

ఇద్దరూ బాత్రూమ్‌కి వెళ్ళి కాళ్ళూ, చేతులు కడుక్కున్నారు. రామ్మూర్తి తన దగ్గరున్న తువ్వాల్ని మిత్రుడికి అందించాడు. కామరాజు ముఖం, చేతులు తుడుచుకొని ఆ తువ్వాల్ని మళ్ళీ రామ్మూర్తికే అందించాడు. ఇద్దరూ డైనింగ్ టేబిల్ దగ్గరికి వెళ్ళారు.

అప్పటికే డైనింగ్ టేబిల్ మీద రెండు విస్తరాకుల్లో భోజనం వడ్డించింది నిశ్చల.

గాజు గ్లాసుల్లో మంచినీళ్ళు పెట్టింది. రెండు మూడు డిష్షులతో కూరలు, సాంబారు టేబిల్ మీదే ఉన్నాయి. పెద్ద వంటకాలు ప్రత్యేకంగా ఏమీ చెయ్యకపోయినా, అన్నం, సాంబారు, రెండు కూరలు, అప్పడంతో సుష్టుగా భోజనం ముగించారు ఇద్దరు మిత్రులూను.

"కాస్త అన్నం వడ్డించమంటారా అంకుల్" అంటూ కామరాజుని ప్రశ్నించింది నిశ్చల.

"మరేం వద్దమ్మా, సుష్టుగా భోంచేశాను" అన్నాడు కామరాజు పెరుగన్నంతో భోజనం ముగిస్తూ.

"మావయ్యగారూ, మీకు వడ్డించమంటారా" అంది నిశ్చల.

ఆశ్చర్యంగా తలెత్తాడు రామ్మూర్తి. కోడలు అలా అడగడం అతని జీవితంలో అది తొలిసారి. అందుకే ఆశ్చర్యం. ఆమధ్య ఓసారి 'కాస్త అన్నం వడ్డించమ్మా' అని తాను అడిగితే, 'ఈ వయసులో మీరు మితంగానే భుజించాలి మావయ్యగారూ. అదే మీ ఆరోగ్యానికి శ్రీరామ రక్ష' అంటూ సమాధానం చెప్పిన కోడలు, ఈ రోజు ఆ ప్రశ్న వేస్తే ఆశ్చర్యం కలగదూ మరి. లోలోన నవ్వుకున్నాడు రామ్మూర్తి.

"వద్దమ్మా నిశ్చలా. నా భోజనం ఎంత పరిమితమైనదో నీకు తెలిసిందే కదా" అన్నాడు రామ్మూర్తి.

మావగారి మాటల్లోని వ్యంగ్యాన్ని అర్థం చేసుకోకపోలేదు నిశ్చల. పక్కకి ముఖం తిప్పి, మూతి విరుచుకుంది.

స్నేహితులిద్దరూ భోజనాలు ముగించి, వాషింగ్ బేసిన్ దగ్గరికి వెళ్ళి చేతులు, నోరు కడుక్కొని

వచ్చేశారు. రామ్మూర్తి, మిత్రునికి టవలు అందించాడు.

కామరాజు చేయి తుడుచుకుని వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. రామ్మూర్తి లోపలికి వెళ్ళి వక్కపొడి తీసుకొచ్చి స్నేహితునికి అందించాడు.

"ఒరేయ్ రామ్మూర్తీ..." మెల్లగా అన్నాడు కామరాజు.

"ఏవిట్రా?"

"భోజనం చాలా రుచిగా ఉందిరా. సుష్టుగా భోంచేశాను. నీ స్నేహమాధుర్యం, మీ కోడలి ఆప్యాయత అందులో మెండుగా ఉన్నాయని పిస్తోందిరా. మరి నేను బయల్దేరతాను" అంటూ లేచాడు కామరాజు.

"అప్పుడేనా? భుక్తాయాసమైనా తీరనీరా."

"మా కజిన్ దగ్గరికి వెళ్ళి, అక్కడ కాస్సేపు ఉండి, వెంటనే శ్రీకాకుళం బస్సు పట్టుకోవాలి కదా. ఆ ప్రయాణమే మూడు గంటలు పట్టేస్తుంది. మరేమీ అనుకోకురా రామ్మూర్తీ. చాలా రోజుల తరువాత కలుసుకున్నందుకు నా హృదయం 'ఎంతగానో పొంగిపోయింది" అంటూ, "అమ్మా కోడలా" అని లోపలికి కేకవేశాడు కామరాజు.

నిశ్చల లోపల్నించి వచ్చింది "ఏవిటి అంకుల్" అంటూ.

"వెళ్ళొస్తానమ్మా. మంచి భోజనం పెట్టావు. 'అన్న దాతా సుఖీభవ' అని మాత్రం దీవించకుండా ఉండలేకపోతున్నాను. వస్తాను మరి" అన్నాడు కామరాజు.

"మంచిదంకుల్." సన్నగా మందహాసం చేస్తూ అంది నిశ్చల.

కామరాజు బైటికొచ్చాడు.

"అమ్మా నిశ్చలా, అలా వీణ్ణి పంపించి వస్తాను" అంటూ రామ్మూర్తి స్నేహితుని వెంట బయల్దేరాడు. ఇద్దరూ కలిసి ఆటో స్టాండు వరకూ వెళ్ళారు.

"ఒరేయ్ కామరాజూ, నీ అడ్రసు ఇవ్వరా. నేనోసారి మీ ఇంటికి వస్తాను" అన్నాడు రామ్మూర్తి.

కామరాజు ముఖంలో రంగు మారింది. ఏదైతే జరక్కూడదని తాను అనుకున్నాడో, ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే మిత్రుడు తీసుకురావడం కాస్తంత ఇబ్బంది కలిగించింది. అయినా, చప్పున తమాయించుకుని, జేబులోనుంచి తన విజిటింగ్ కార్డు తీసి స్నేహితునికి అందించాడు.

"అందులో నా అడ్రసు ఉందిరా రామ్మూర్తీ" అన్నాడు కామరాజు.

రామ్మూర్తి చేతిలో ఉన్న విజిటింగ్ కార్డు చదువుకున్నాడు.

"ఏవిట్రా రాజూ, నీకో విజిటింగ్ కార్డు ఉందా!" ఆశ్చర్యంగా అడిగాడు రామ్మూర్తి.

కామరాజు పొడిగా నవ్వేడు. "నువ్వు ఆశ్చర్యపోతావని నాకు తెలుసునురా. దీన్ని నేను వేయించుకోలేదు. మా అబ్బాయి తన విజిటింగ్ కార్డు వేయించుకుంటున్నప్పుడు నా కోసం ఓ యాభై కార్డులు వేయించాడ్రా. దానికి తర్వాత భార్య చేత చీవాట్లు కూడా తిన్నాడు." నవ్వుతూ అన్నాడు కామరాజు.

"అయితే, మీ కోడలు లేడీ హిట్లరన్నమాట." ముసిముసిగా నవ్వుతూ అన్నాడు రామ్మూర్తి, తన పరిస్థితే కాస్త నయంగా ఉన్నందుకు లోలోన మురిసిపోతూ.

"సుమారుగా అంతేలే. కానీ, ఏం చెయ్యగలం. మన గౌరవాన్ని మనం నిలబెట్టుకుంటూ, మన మనుగడ సాగించాలి. సరేగాని, నువ్వు వచ్చే ముందు ఓ ఉత్తరం రాయిరా. ఏ సమయంలో వస్తున్నదీ తెలియజేస్తే కాంప్లెక్సుకి వచ్చి నిన్ను కలుస్తాను. మన కోసం ఓ లాడ్జీలో రూమ్ తీసుకుంటాను. ఆ రోజంతా హాయిగా గడుపుదాం,



అక్కడే భోజనం కూడాను. నీకు ఎదురైన పరిస్థితి నాకు ఎదురవ్వకూడదు" అన్నాడు కామరాజు.

విస్తుపోయాడు రామ్మూర్తి. అంటే, తనింట్లో తనకీ, కోడలికీ జరిగిన సంభాషణ కామరాజు వినే ఉంటాడనుకున్నాడు.

"అంటే, నాకూ, మా కోడలికీ జరిగిన సంభాషణ విన్నావేవిట్రా రాజూ?" స్నేహితుని ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాడు రామ్మూర్తి.

రామ్మూర్తి చేతులు పట్టుకున్నాడు కామరాజు.

"నన్ను క్షమించరా మూర్తీ. నేను కావాలని

> "చాలా ఇళ్ళల్లో ఇదే కథరా రామ్మూర్తీ. కొందరెవరో అదృష్టవంతులుంటారు. నా ఇంట్లో నా పరిస్థితి, నీ ఇంట్లో నీ పరిస్థితికి భిన్నం కాదు" అన్నాడు కామరాజు.

విన్లేదు. మీ మాటలే నాకు వినిపించాయి. వెంటనే వెళ్ళిపోవాలన్న ఆలోచన కూడా వచ్చింది. కానీ, నువ్వు ఏం బాధపడతావోనన్న ఉద్దేశంతో ఆ సాహసానికి పూనుకోలేదు. చాలా ఇళ్ళల్లో ఇదే కథరా రామ్మూర్తీ. కొందరెవరో అదృష్టవంతులకు ఇటువంటి సంఘటనలు ఎదురవ్వవు. అవి చాలా అరుదనే చెప్పాలి. నా ఇంట్లో నా పరిస్థితి, నీ ఇంట్లో నీ పరిస్థితికి భిన్నం కాదు కాబట్టే, హోటల్లో ఏర్పాటు చేస్తానన్నాను" అన్నాడు కామరాజు.

రామ్మూర్తి భారంగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"సారీరా కామరాజూ. నువ్వెంతో హాయిగా, ఆనందంగా ఉన్నావని అనుకున్నాన్రా. నా ఊహ అపోహే అయింది. సరే, నేను తప్పకుండా నీ దగ్గరికి వస్తాను. వచ్చే ముందు ఉత్తరం రాస్తాను. కాంప్లెక్సుకి రారా" అంటూ ఖాళీ ఆటోని కేక వేశాడు రామ్మూర్తి.

కామరాజు ఆటోలో కూర్చున్నాడు. "మరి, వెళ్ళొస్తారా" అన్నాడు.

"మంచిదిరా. ఉత్తరాలు రాస్తూ ఉండు."

ఆటో ముందుకు సాగిపోయింది.

ఆ ఇద్దరి మిత్రుల కుడి చేతులు కాస్సేపు గాల్లో ఊగాయి.

రామ్మూర్తి భారంగా నిట్టూరుస్తూ వెనక్కి తిరిగాడు. ఇంటికేసి నడిచాడు. అతని అడుగులు భారంగా పడుతున్నాయి. ■